# ఆనేనే ఈనేను



అమ్మాయి రైలు దిగుతున్నది!

అబ్బాయి రైలు ఎక్కుతున్నాడు!

ఆ క్షణం చాలనుకున్నాయేమో యిద్దరి చూపులూ మనసులై మాట్లాడుకున్నాయి. నిజమని నమ్మలేని యాధృచ్ఛిక సంఘటన. యిద్దరికీ ఆ సమయం అలా కలిసొచ్చిందంతే!

ఒకసారి వింటే చాలు గుర్తుండే తన సెల్ నెంబరు ఒకసారే చెప్పింది. అంతకుమించి యింకో మాటకు అవకాశం లేదు. అమ్మాయి టూ అబ్బాయిటూ అయ్యారు. ఇద్దరి గమ్యం యిష్టంలేని పెళ్లిచూపులే! రైలు కదిలింది.

*　　*　　*

డబుల్‌నైన్ ట్రిబుల్ సిక్స్ టూ టూ త్రీ టూ టూ!

నెంబర్లు నొక్కుతున్నాడు. వేలు నొప్పెడుతున్నది గానీ కాల్ కలవడం లేదు. అనంతానికి అనంత ఆనందం అందడం లేదు.

ఎవరి బెర్తుల్లోవాళ్లు నిద్రాముద్రలో వున్నారు. ముసుగులో కూడా తన ప్రయత్నం మానలేదు అనంతం.

"ట్రై చేసింది చాల్లేరా పడుకో" దుప్పటి కొద్దిగా తొలగించి అంది అనంతం చెల్లెలు అనవరతం.

'నువ్వెలా కనిపెట్టావే' అన్నాడు ఆశ్చర్యంగా చెల్లెలికి మాత్రం వినిపించేలా.

"చాల్లే... సెల్లులో ఫోటో కూడా తీశావుగా. ఒక్కసారి చూపించరా" అంది అనవరతం.

"వివాహ వస్త్రవేదిక - అంటూ ఓ గోనె సంచీ మీది అక్షరాలు అడ్డంగా పడ్డాయి చూడు" అన్నాడు అనంతం దిగులుగా.

నవ్వులో జాలిని మిళితం చేసింది అనవరతం.

*　　*　　*

పొద్దున్నే పైనుంచి దిగుతుంటే కాలుజారింది అనంతానికి. జేబులో సెల్లు ఎగిరి ఓ భర్త ముక్కుకి రాసుకుని, ఆయన భార్య చేతికి తగిలి డిప్పలూడి కిందపడింది. తన పొరపాటు వల్ల వాళ్లకి కలిగిన యిబ్బందికి సారీ చెప్పాడు. సెల్లు సరిచేసుకున్నాడు. యింకా ఏదో వెతుకుతున్నాడు సీట్ల కింద కాళ్లు తప్పిస్తూ. అనంతం వెతుకుతున్నదేంటో అక్కడ కూర్చున్న ఎవరికీ అర్థంకాలేదు. తనవాళ్లకి తప్ప!

"పోతే పోయిందిలేరా, బట్టలెందుకు మాపుకుంటావు" అంది అనంతం తల్లి కరకటం.

"బంగారప్పన్నే అది" కేకేశాడు అనంతం తండ్రి కరతాళం.

"అయితే తీగలాగి రైలాపి పట్టా పక్కన రాళ్లన్నీ వెతికిరండి" అంది కరకటం.

"ఇక్కడే ఎక్కడో పడుంటుంది లెండి" అన్నీ విషయం తెలుసుకున్న అందరూ కిందామీదపడి దొరికేట్లులేదన్న నిట్టూర్పులు విడిచారు.

"తొర్రిపన్నుకి నాలుక అడ్డం పెట్టడమే మిగిలింది. మైండుకీ బాడీకీ ఏదో తేడా వచ్చినట్లుంది వెధవకి. లేకపోతే వాడు కిందపడడమేంటి" అన్నాడు కరతాళం.

"మీరాగండి - వాడి బాధలో వాడుంటే మధ్యలో మీ నసుగుడొకటి" అంది కరకటం.

"వాడికి బాధేంటి! పైన కూర్చుని సెల్లుతో ఏదో ఆటాడుకుంటున్నాడు" అన్నాడు కరతాళం.

అనవతరం నవ్వింది.

'చాల్లే నవ్వావు' అన్నాడు అనంతం.

'అవునూ బంగారప్పన్నెందుకు పెట్టాల్సివచ్చిందండీ' అడిగింది కరతాళాన్ని పక్కావిడ. కరతాళం విననట్లున్నాడు.

"చిన్నప్పుడు ఈతనేర్చుకోవడానికి వెళ్తే రాయికొట్టుకున్నదండీ" చెప్పింది కరటకం.

"రాయిదే తప్పంటావు" అన్నాడు కరతాళం భార్యకే వినపడేట్లు.

"అబ్బాయి పెరుగుతున్నకొద్దీ పన్నుమారు

స్తున్నారా అదే పన్ను వాడుతున్నారా" తన సందేహాన్ని ప్రశ్నగా మార్చింది పక్కావిడ.

'ఏవిటోయ్ నీ చొప్పదంటు ప్రశ్నలూ' విసుక్కున్నాడు ఆవిడ భర్త ముక్కు నలుపుకుంటూ.

"అదేంటండీ పుట్టగానే బోసినోరు. తర్వాత బియ్యపు గింజంత. ఆ తర్వాత గుమ్మడిత్తంత... పన్ను పెద్దదవుతూనే వుంటుంది కదండీ. అయినా మా ముచ్చట్లు మావి... మీరు తల దూర్చకండి" అందావిడ.

తలమీద మొట్టికాయ వేసుకున్నాడాయన ఏదో అనబోయి గుర్తురాక.

"మిమ్మల్నేం అడిగానో మరచిపోయాను. అదేదోలెండిగాని, యిప్పుడు మీ అబ్బాయిని ఎన్ని పళ్లనగిడితే ముప్పయిరెండే. అందులో ఒకటి బంగారంది అని చెప్పాల్సిందేగా" అందావిడ మళ్లీ కరటకాన్ని ముచ్చట్లోకి దింపుతూ. ఆవిడ భర్త చికాకుతో లేచాడు. అనంతం నెంబరు నొక్కుతూనే వున్నాడు.

"పదినిముషాల్లో తిరుపతి వస్తుంది. కదలకుండా కూర్చోండి" అందావిడ.

"నీ అనంత దంత ఉదంతం అంతం అయిందాకా అటూ ఇటూ తిరిగొద్దామని లేచాలే" అన్నాడాయన అందరినీ అమాయకంగా కలయజూస్తూ. కరతాళం సెల్లు మోగింది. కరతాళం 'హలో' అని ఆందోళనగా చూడదంతో అంతా నిశ్శబ్దం అయ్యారు.

"అయ్యా క్షమించండి. మీరు మా యింటికి పెళ్లిచూపులకు కాదు మా అమ్మాయి పెళ్లికి వస్తున్నట్లుగా అయింది మా పరిస్థితి. చివరి క్షణంలో అమ్మాయి అసలు సంగతి చెప్పింది. మీకు మొహమెలా చూపించాలో తెలీక ముందు మాటేస్తున్నాను".

"ఈ సంగతేదో మీ గడప తొక్కింతరువాత చెప్పారుకాదు. అయిందేదో అయింది మీరు పిలిచారుగదాని పనిగట్టుకుని బయల్దేరాము. సెంటిమెంట్లు నాకు అంటవు. మీరు నాకు రానూ పోనూ ఖర్చులివ్వాల్సిందే. మీకోసం బయల్దేరిన మా అబ్బాయి కనకదంతం వూడిపోయింది కనక ఆమేర బంగారం కూడా మీరివ్వాల్సిందే."

"అదేంటండీ"

"రైలు దిగగానే మాట్లాడుకుందాం. మీరు స్టేషన్‌లోనే వుండండి".

ఫోన్లో అమ్మాయి తండ్రితో మాట్లాడిన వివరమంతా అందరికీ చెప్పాడు కరతాళం. భర్త నైజానికి మనసులో చికాకు పడింది కరకటం.

ఇంతలో కెవ్వుమని అరిచి పైనుంచి దూకినంతపనిచేసి సెల్లు చెవికి అంటించుకుని పక్క కంపార్టుమెంటులోకి వెళ్లాడు అనంతం.

అనంతం హడావిడికి నవ్వుకుంది చెల్లెలు అనవతరం.

* * *

అనంతానికి ఎట్టకేలకు సెల్లు పలికింది.

"ఈ ఫోనెవరిదండీ" అవతలి నుంచి ఓ మగగొంతు. ఉలిక్కిపడ్డాడు అనంతం. గుండె దిటవు చేసుకున్నాడు. ఎవరైనా మాట్లాడాల్సిందే అనుకున్నాడు.

"ముందు మీరెవరో ఈ ఫోన్లోకి ఎలా వచ్చారో చెప్పండి" అన్నాడు అనంతం.

"బాబో, ఈ సెల్లు నాకు సికింద్రాబాద్ స్టేషన్లో దొరికింది. కిందపడడం వల్లనో ఏంటో మోగటం ఆగింది. రిపేరు చేయించి మీతో మాట్లాడుతున్నాను" చెప్పాడతను అనంతానికి విషయం పూర్తిగా అర్థమయింది.

"అయ్యా ఆ సెల్లు మాదే. మా ఫ్యామిలీ గొడవలన్నీ ఆ సెల్లులో నెంబర్లతో ముడిపడి వున్నాయి. దయచేసి మీరాకాల్‌లిస్టేదో చూసి నాలుగైదు నెంబర్లు చెప్పండి చాలు. ఆ తర్వాత కావాలంటే ఆ సెల్లుని నా బహుమతిగా మీ దగ్గరే వుంచుకోండి" అన్నాడు అనంతం. ఆ క్లూ చాలు తన పని సుగమం కావడానికి.

"ఈ పాత సెల్లు నేనేం చేసుకోను. దొరికి నవి దొరకనివి అమ్ముకుని బతికేవాణ్ణి" అన్నాడ తను.

"అడ్రసు చెబితే అడిగినంత చేతిఖర్చు యింటికొచ్చి యిస్తాగాని ముందా నెంబర్లు చెప్పండి" అన్నాడు అనంతం – దొంగకి దొంగ తనం చేయకుండానే దొరికిందన్నమాట అని మనసులో అనుకుని.

"అయ్యా అయినవాళ్లకు కూడా నా అడ్రసు చెప్పనుగాని మీ నెంబరుతో మీ అడ్రసు పట్టు కుని మీ యింటికి వస్తాను. మీరిచ్చేదేదో యి చ్చేద్దురుగాని. ఆ నెంబర్లు చెబుతాను రాసు కోండి" అన్నాడతను. మూడు నెంబర్లతో యిక చాల్లే అన్నాడు అనంతం.

* * *

రైలు దిగడంతోటే పక్కనున్న సాక్ష్యాలతో పన్ను సంగతి చెప్పి అమ్మాయి తండ్రి జేబులు దులిపాడు కరతాళం.

"ఇంకానయం తిరుమల కొండమీద కాటే జీ, దర్శనం టిక్కెట్లు కూడా నన్నేయిమ్మన్నారు కాదు" అన్నాడు అమ్మాయి తండ్రి.

"బాగా గుర్తుచేసారు. మీరు పెళ్లి చూపుల న్నారు కాబట్టే పనిలో పనిగా మేం దైవదర్శనం పెట్టుకున్నాం. ఆ ఏర్పాట్లు మీరు చేస్తానన్నారు కాబట్టే మిమ్మల్ని నమ్ముకుని మేమొచ్చాం. యి ప్పుడు తప్పించుకుంటానంటే ఎట్లా" అన్నాడు కరతాళం.

"ఆయనంతే అంటారు లెండి. దానికి దీని కీ లింకేం లేదు. కాలినడకనైనా వెళ్లి స్వామి కాళ్లు దొరక్కపోతే కొండమీద ఏబండకైనా మొక్కి మొక్కు తీర్చుకుందామనుకున్నాంలెండి" అంది కరకటం.

"ఇప్పుడాయనకి మన దర్శనాదర్శ అంత లా చెప్పాలా" అన్నాడు కరతాళం భార్య తనకే దో నష్టం చేస్తున్నట్లు మొహం పెట్టి.

"కుమిలిపోతున్నవాణ్ణి కమిలిపోయేట్లు చేసి దేవుడి పేరు మీద కూడా డబ్బులు గుంజుతారే మోనని" అంది కరకటం.

చూపులు పక్కకు తిప్పాడు కరతాళం.

* * *

దొరికిన క్లూతో తీగబాకి లక్ష్యం చేరుకు న్నాడు. దొంగలో దొరతనం దేవుడిపనే అను కున్నాడు. అంతా బాగానేవుంది. గుండు చే యించుకుంటే మనసుదోచిన అమ్మాయి గుర్తు పడుతోందో లేదో... ఆకారం నచ్చక మనసు మార్చుకుంటోందో ఏమో అని తనమీద తనకే అనుమానాలు మొలిచాయి.

"కళ్యాణపీటల మీద కూర్చునేవాణ్ణి కళ్యా ణకట్ట మీదకి నెట్టకే" అని తల్లి కాళ్లావేళ్లాప డ్డాడు. అసలు సంగతి నాన్నకు అప్పుడే చెప్పొ ద్దని చెప్పి తను తెలుసుకున్న సంగతులన్నీ తల్లికి, చెల్లికీ చెప్పాడు.

"వేల జీతాల సాఫ్ట్‌వేర్ వూడిపోయి జీవి తం హార్డ్‌వేరయిన వాళ్లేనన్నమాట యిద్దరూ" అంది చెల్లెలు అనవరతం. "కాళ్లనొప్పులు, కీళ్లనొప్పులూ యిప్పుడు తెలుస్తున్నాయట అదే దో కనుక్కున్నావురా" అంది తల్లి. ఈ మాటల్లో అమ్మాయి ఫోన్ చేసింది. 'హాయ్ అనంతం' అంది.

'నాపేరు నీకెలా తెలిసింది? నేను చెప్పలేదుగా' అన్నాడు అనంతం.

'నాపేరు నీవు తెలుసుకున్నప్పుడు నీ పేరు నేను తెలుసుకోలేననుకున్నావా' అంది.

"అమ్మాయి పేరేమిటిరా" అడిగింది తల్లి అనంతాన్ని తట్టి.

"అవనీతలం"

అవనీతలమా అని ఆలోచనలోపడింది తల్లి ఎక్కడో విన్నట్టుందే అనుకుంటూ. సెల్లుని చెవిపోగులా చేసి అలా చెట్లపొదల్లోకి వెళ్లాడు అనంతం. అక్కడ తను కూర్చుంది ఎవరూ చూడలేరులే అనే ఓ ఏకాంత తీరంలో. కానీ - తండ్రి తెలియకుండా వచ్చి అనంతాన్ని గట్టిగాపట్టుకున్నాడు. ఎందుకో అర్థంకాలేదు అనంతానికి తండ్రి వెంట వచ్చిన కత్తుల కేశఖండం తన నెత్తిమీద కత్తి ఆడించి వెళ్లిందాకా. నెత్తిమీద చేయిపెట్టి చూసుకుని కెవ్వుమని కేకేసాడు అనంతం.


'ఆ గావుకేకేంటి అనంతం' అడిగింది అవనీతలం.

తన నెత్తిమీద కురుపులు బయట పడ్డాయని చెప్పాడు అనంతం. "కురుపులుంటే నువ్వు కురూపి ఎందుకవుతావు అనంతం. నా తల పేనుల ప్లానెట్" అని ఏదో చెప్పి అనంతాన్ని సముదాయించింది అవనీతలం.

* * *

పూర్ణగుండ్రశిరంతో తల్లిదండ్రులకు ఆనందంగా దండంపెట్టాడు అనంతం. తండ్రి ఆనందమే తనకు ఆశ్చర్యం కలిగించింది.

"ఇప్పుడే అవనీతలం వాళ్ల నాన్నతో అంతా మాట్లాడానురా. నీ చిన్నప్పుడు మేం తాడేపల్లిలో బోడేపల్లి భూషయ్య గారింట్లో అద్దెకు



ప్రముఖ కవి ఎన్.వి. రఘువీర్‌ప్రతాప్ రచించిన 'విశ్వ రహస్య విశేషము' గ్రంథాన్ని నగర కేంద్ర గ్రంథాలయం, హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్నవారు రఘుశ్రీ, ఆచార్య పి. చెన్నారెడ్డి, డా॥ కొలకలూరి ఇనాక్, గుదిబండ వెంకటరెడ్డి, డా॥ వి.వి.ఎల్. నర్సింహారావు, రఘువీర్‌ప్రతాప్, కోకా వీరప్రసాద్ తదితరులు

వున్నాం. ఆయన మనవరాలే అవనీతలం. ఆ రోజుల్లో ఆయన్ని భూముల భూషయ్యగారనే వాళ్లు. పుడమితల్లి క్షేమంగా వుండాలని పూజలు చేసేవాడు...”

తండ్రి బాడీ లాంగ్వేజీ చూస్తుంటే కళ్లలో పెళ్లిపందిరి కనపడింది అనంతానికి.

* * *

పెళ్లి వెరైటీగా రైలు డబ్బాలో చేద్దాం...

కాదు విజయవాడలో మా యింట్లోనే...

కాదు జంటనగరాల్లోనే మావాళ్లు ఎంతో మంది వున్నారు...

రిజిస్ట్రేషన్ మ్యారేజీ రోజుల్లో ఆడంబరాలెందుకు...

టీటీడీ వారి ఉచిత కళ్యాణాల్లో కూచోబెడితే పట్టుబట్టలు, మంగళసూత్రాలూ కూడా యిస్తారట...

చివరికి కనకదుర్గ అమ్మవారి గుళ్లో పెళ్లికి నిర్ణయించారు.

* * *

బుగ్గమీద పెళ్లి బొట్టుతో కళకళలాడుతున్న కొడుకుని మంగళ వాయిద్యాలతో కనకదుర్గమ్మ గుడిమెట్లు ఎక్కిస్తూంటే కరతాళానికి తిరుపతి పెళ్లిచూపుల అమ్మాయి తండ్రి ఎదురయ్యాడు. చికాకుగా చూసాడు కరతాళం.

“నేనిచ్చిన డబ్బు నా యీ రానూపోనూ ఖర్చులు బంగారప్పన్నుతో సహా మొత్తం తిరిగి యివ్వాల్సిందే” అన్నాడాయన.

“నువ్విలా అడ్డం వచ్చి అలా అడగడంలో ధర్మం ఏమన్నా వుందా” అన్నాడు కరతాళం.

“ధర్మం వుంది కాబట్టే వచ్చాను. న్యాయం వుంది కాబట్టే నిజాయితీగా నాకు రావాల్సింది తీసుకోవాలనుకుంటున్నాను” అన్నాడాయన.

“ఏమిటయ్యా నీ నీతి, నిజాయితీ” కొద్దిగా కోపంగా అన్నాడు కరతాళం. అందరూ ఆందోళనగా చూస్తున్నారు.

“మా అమ్మాయిని చూడడానికి మీరొస్తుంటేనే కదా ఈ పెళ్లి మీకు కుదిరింది. అంతకంటే ఏం కావాలి” అన్నాడాయన.

గతుక్కుమన్నాడు కరతాళం.

“అని నువ్వెలా రుజువు చేస్తావు?” నిభాయించుకుని అన్నాడు కరతాళం. అనగానే ఆయన ఈలేసాడు. కరతాళంతో రైలు ప్రయాణం చేసిన వాళ్లు వచ్చారు.

“వాళ్లు నావైపువాళ్లు. నీవైపుకెలా తిరిగారు” అన్నాడు కరతాళం.

“మీ అబ్బాయి నడవడి తెలుసుకోవడానికి నేను మీ వెంటపెట్టినవాళ్లే వీళ్లు. యిప్పుడు వాళ్ల ఖర్చులు కూడా కలిపి యివ్వాల్సిందే” అన్నాడాయన. కరతాళం లొంగక తప్పలేదు.

* * *

“భీకరతాళానికి తాళం వేసే వాడొకడు దొరికాడు యిన్నాళ్లకు” అంది కరకటం.

“ముందు నీ నోటికి వెయ్యాలే చెంచెల్‌గూడా జైలుకి వేసే తాళం” అన్నాడు కరతాళం.

“ఇప్పటికైనా అన్నివేళలా మీ వ్యాపార దృష్టి మంచిది కాదని తెలుసుకోండి. ఆత్మీయతకు అనురాగాలకు విలువ యివ్వడం నేర్చుకోండి” అంది కరకటం. బిక్కమొహం వేసాడు కరతాళం.

తండ్రి దగ్గరకు వచ్చింది కూతురు అనవతరం. తండ్రి భుజం మీద ఆప్యాయంగా చేయివేసింది. “నాన్నా యిదిగో అన్నయ్య బంగారప్పన్ను” అంటూ చేతిలో పెట్టింది. ●